క్లుప్తంగా

వైభవంగా పల్లకీ ఉత్సవం

గంపలగూడెం: స్థానిక షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయం వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాబా ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. ధ్యాన నిలయం కమిటీ సభ్యులు జిడుగు నాగభూషణం, ఆర్యవైశ్య సంఘం మండల మహిళా విభాగం అధ్యక్షులు వనమా సుజాత, ప్రధాన కార్యదర్శి వనమా సత్యవాణి, ట్రెజరర్ వజినేపల్లి మాధురి, వీఆర్వో వనమా పద్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో తేరు ప్రదక్షిణ

ఆగిరిపల్లి: మండలంలోని రాజవరంలో రాజ వరప్రసాద మాత ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం తేరు ప్రదక్షిణను పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లిలో వైభవంగా నిర్వహించారు. ఫాదర్ జంగం విజయ్ కుమార్ దివ్య బలి పూజ సమర్పించారు.

క్రీడా, క్రాఫ్ట్ పరికరాలు అందజేత

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయానికి వివిధ రకాల ఆటలు, క్రాఫ్ట్ పరికరాలను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కందుల విజయకుమార్ గ్రంథాలయ నిర్వహణాధికారి జె. శ్రీలతకు గురువారం అందజేశారు. దాతకు శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నూజివీడు: నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు బస్సు సర్వీసులు, ఇతర సమస్యలపై సెల్ నెంబర్: 99592 25461కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చని చెప్పారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

చిలుకూరువారిగూడెం(మైలవరం): పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయమని శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి అన్నారు. మైలవరం మండలం చిలుకూరువారిగూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.35 వేలు విలువ చేసే కంప్యూటర్ యూనిట్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. నారాయణరావు, పుల్లూరు పీఏసీఎం అధ్యక్షుడు చిలుకూరి రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): స్వాతంత్య్ర సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రోద్యమంలో వారి సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఇరువురు చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేశారు. సేవా కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత



ఇబ్రహీంపట్నం: ఫెర్రీ గ్రామంలో ఇటీవల విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఏపీ సీపీడీసీఎల్ అసిస్టెంట్ లైన్‌మెన్ కన్నా వీరాంజనేయులు కుటుంబానికి యాక్సిస్ బ్యాంక్ అధికారులు రూ.28 లక్షల ఇన్సూరెన్స్ మంజూరు చేశారు. ఆ బ్యాంక్ ఆంధ్ర సర్కిల్ అధికారి రవీంద్రనాథ్, సర్కిల్ శాలరీ అధికారి కిషోర్ మృతుడి భార్య కన్నా రాజేశ్వరికి చెక్కును గురువారం అందజేశారు. బ్యాంక్‌లో లోన్ తీసుకున్న సమయంలో జీవిత బీమా కట్టడం వలన కుటుంబానికి ఇన్సూరెన్స్ ఉపయోగపడిందని వారు అన్నారు. క్లస్టర్ ప్రధాన అధికారి పఠాన్ మస్తాన్‌వలి, బ్యాంక్ మేనేజర్ మునీర్, ఏపీసీపీడీసీఎల్ సంస్థ ఈఈ శ్రీనివాసరావు, ఏడీఈ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి తనిఖీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఎన్టీటీపీఎస్ పరిధిలో వెలువడుతున్న కాలుష్యంపై కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు గురువారం తనిఖీ చేపట్టారు. కొండపల్లి షాబుఖారీ దర్గా సమీపంలో వ్యాపిస్తున్న కాలుష్యంపై ఆ సంస్థ పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజా అభ్యంతరం వ్యక్తం చేసి ఎన్టీటీపీఎస్‌ను ముట్టడిస్తామని అల్టిమేటం పంపారు. స్పందించిన అధికారులు పట్టణంలోని గ్రామిక నగర్‌లో ఓ భవనంపై కాలుష్యం సేకరణ యంత్రం ఏర్పాటు చేశారు. 24 గంటల పరిశీలన అనంతరం కాలుష్యం ఏ మేరకు వ్యాపిస్తుందో నివేదిక ఇస్తామని వారు వెల్లడించారు. గతంలో మాదిరిగా కాకుండా వాస్తవ నివేదిక ఇవ్వాలని మతగురువు అల్తాఫ్‌రజా కోరారు.

నెరవేరిన రహదారి కల

- రూ. 4.82 కోట్లతో తారురోడ్డు నిర్మాణం
- 7.80 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి
- 10 గ్రామాలకు సౌకర్యవంతంగా రహదారి

పెద్దకొమిర(గంపలగూడెం): సరైన రహదారి సౌకర్యం పది గ్రామాల ప్రజలు, పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేందుకు రైతులు ఎంతో కాలంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) నిధులు రూ.4.82 కోట్లు మంజూరు కావడం, రహదారి నిర్మాణం చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజల రహదారి కల నెరవేరింది. ఇబ్బందులు తొలిగాయి. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గంపలగూడెం, తిరువూరు మండలాలకు చెందిన ఎనిమిది హేబిటేషన్‌ల పరిధిలో విస్తరించి ఉన్న అమ్మిరెడ్డిగూడెం–వాముకుంట్ల రహదారిని అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా రహదారి వెంట ఉన్న వందలాది ఎకరాల రైతులు, వివిధ గ్రామలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారిపై రైతులు పంట పొలాలకు వెళ్లేందు నానా ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు 2021లో పీఎంజీఎస్‌వై–3 ఫేజ్‌లో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. టెండరు పిలిచిన అనంతరం రాఘవ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ వారికి రహదారి నిర్మాణ పనులను అప్పగించారు. పంచాయతీరాజ్ ప్రాజెక్టుల విభాగం డీఈ బాణావతు రవి, ఏఈ సత్తులూరి శ్రీనివాస్ పర్యవేక్షణలో పనులు కొనసాగించారు.



అభివృద్ధి చేసిన తర్వాత రహదారి



వాగు అలుగు పారే ప్రాంతంలో సీసీ రోడ్డు, సైడ్‌వాల్ నిర్మాణం

7.80 కిలో మీటర్ల రహదారి అభివృద్ధి

గంపలగూడెం మండలం పెద్దకొమిర నుంచి తిరువూరు మండలం వాముకుంట్ల వరకు పంచాయతీరాజ్ శాఖకు చెందిన రహదారి 26.5 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. ఈ రహదారి ఎనిమిది హేబిటేషన్‌ల పరిధిలోని గ్రామాలను కలుపుతోంది. పూర్తి రహదారిలో మండల పరిధిలోని 7.80 కిలో మీటర్ల పొడవున రహదారిని తారురోడ్డుగా నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. 3.75 మీటర్ల వెడల్పుతో తారురోడ్డుగా నిర్మించారు. దీనితోపాటుగా సీసీ రోడ్డు వెంట వాగు నీటి ప్రవాహాన్ని తట్టుకునేందుకు సైడ్‌వాల్ నిర్మించారు. రహదారిలో లోతట్టుగా ఉన్న, పొలాలకు నీరు పారే రోడ్డు క్రాసింగ్‌ల వద్ద 14 పైపు కల్వర్టులను నిర్మించారు. మూడు హేబిటేషన్‌ల పరిధిలో రహదారి అభివృద్ధి పనులు పూర్తి కావడంతో రహదారి ఆయా గ్రామస్తులకు, పంట పొలాలకు వెళ్లేందుకు రైతులకు సౌకర్యవంతంగా మారింది. ఈ రహదారి నిర్మాణంతో అమ్మిరెడ్డిగూడెం, పెద్దకొమిర, మేడూరు, సొబ్బాల, గుళ్లపూడికి రహదారి సౌకర్యవంతంగా మారింది. ఈ రహదారి నిర్మాణంతో పలు గ్రామాలకు రాకపోకలకు దూరం కూడా తగ్గుతుంది. పూర్తి రహదారిలో గుళ్లపూడి నుంచి తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లి, వావిలాల, వాముకుంట్ల వరకు ఇంకా రహదారిని తారురోడ్డుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికై పీఎంజీఎస్‌వై–4 ఫేజ్ నిధులు కోరుతూ అంచనాలు రూపొందించినట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు.



ఇబ్బందులు తొలిగాయి

రహదారి అభివృద్ధితో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలిగాయి. ముఖ్యంగా రైతులు పంట పొలాలకు రాకపోకలకు సౌకర్యం ఏర్పడింది. గతంలో వర్షాకాలం వచ్చిందంటే రహదారిపై కాలినడకకు సైతం ఇబ్బందులు పడేవారం. రహదారి అభివృద్ధితో సరైన రూపురేఖలు సంతరించుకొన్నాయి.

– పాపినేని శేషగిరిరావు,
పెద్దకొమిర, గంపలగూడెం మండలం



వాగు వద్ద పరిస్థితి మెరుగుపడింది

రహదారిలో కొత్త చెరువు అలుగు పారే ప్రాంతంలో రోడ్డు కొట్టుకుపోయి పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో రాకపోకలకు అలవికాకుండా పోయింది. ఈ పరిస్థితిలో రహదారిని బ్లాక్స్‌రోడ్డుగా మార్పు చేస్తూ వాగు అలుగుపారే ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం, పక్కన సైడ్‌వాల్ ఏర్పాట్లతో కష్టాలు తీరాయి.

–దిరిశాల వెంకటేశ్వరరావు,
పెద్దకొమిర, గంపలగూడెం మండలం

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముసునూరు: ఓటర్లు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయించాలని నూజివీడు ఆర్డీఓ భవానీ శంకరి అధికారులను ఆదేశించారు. మండలంలోని బలివే ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వృద్ధ ఓటర్ల కోసం ర్యాంపులను ఏర్పాటు చేయాలని అధికారులు, బీఎల్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ ఎమిలీ కుమారి, ఎంపీడీఓ పద్మావతి దేవి, వీఆర్వో మణీంద్ర, బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హీల్ సంస్థ సేవలు ఎనలేనివి

ఆగిరిపల్లి: 32 ఏళ్లుగా నిరుపేదలు, అనాథ పిల్లలకు హీల్ సంస్థ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని శాంత బయోటెక్ వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం తోటపల్లిలోని హీల్ సంస్థను సందర్శించి అలేఖ్య ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ప్రతిపాదిత డీమ్డ్ విశ్వవిద్యాలయ భవనాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ సంస్థ ద్వారా 16 వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దామని చెప్పారు. కార్యక్రమంలో హీల్ సంస్థ ఉపాధ్యక్షుడు జీడీపీ ప్రసాద్‌రావు, కార్యదర్శి తాతినేని లక్ష్మి, కోశాధికారి మార్గాని రామచంద్రరావు, హీల్ ఇండియా అధ్యక్షుడు రామవుతార్ యాదవ్, క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, సీఈఓ అజయ్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

సర్నాల తిరుపతిరావు

రెడ్డిగూడెం: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. రెడ్డిగూడెం మండల పరిధిలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప ముందుకు తీసుకువచ్చారని వివరించారు. కరోనా సమయంలో వలంటీర్ల అమూల్యమైన సేవలు అందించారని చెప్పారు. అనంతరం వలంటీర్లను సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలతో సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



మైలవరంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న తిరుపతిరావు

- మైలవరం: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం శ్రీ ఎస్వీఎస్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం జరిగింది. తిరుపతిరావు మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా అర్హత కలిగిన వారిని గుర్తించి పథకాలు అందిస్తున్నారని వివరించారు. వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు అందజేసి సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విస్తృత ప్రచారం

గంపలగూడెం: ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గంపలగూడెంలో కళాభారతి సభ్యులు నాటిక రూపంలో గురువారం ప్రచారం చేశారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేసిన ఐసీటీసీ సెంటర్స్‌కి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు పొందాల్సిన వైద్యం, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. క్షయవ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కళాకారులు వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామి తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం



తిరువూరు: తిరువూరులోని శ్రీవేంకటాచల స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, అంకురార్పణ, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 24న రాత్రి 10 గంటలకు స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం, 25న గరుడోత్సవం, 26న రథోత్సవం, 27న పూర్ణాహుతి, 28న పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. స్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా జరిగే తిరునాళ్లకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా స్కౌట్స్, గైడ్స్ దినోత్సవం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ ఫౌండర్ బెడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్కౌట్స్ ప్రతిజ్ఞతో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. స్కౌట్స్ విద్యార్థులు స్వీయ క్రమశిక్షణతో నైతిక విలువలు, దేశభక్తి కలిగి ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సంధ్యారాణి అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని శైలజ తదితరులు పాల్గొన్నారు.

70 మందికి వైద్య పరీక్షలు

తిరువూరు: రాధా లక్ష్మీ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరువూరు క్లస్టర్లో పాల ఉత్పత్తిదారులకు గురువారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీపురం పాల శీతల కేంద్రం పరిధిలో గతంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో గుండె సంబంధిత సమస్యలున్న 70 మంది రైతులకు యాంజియోగ్రామ్, కార్డియాక్ హెల్త్ చెకప్ నిర్వహించారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పర్యవేక్షణలో వరుణ్ కార్డియాక్ న్యూరో సైన్సెస్ వైద్యులు వైద్య పరీక్షలు చేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

స్వామిదాసు

నరసాపురం (విస్సన్నపేట): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నతులుగా ఎదగాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. నరసాపురం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో గ్రామ ప్రముఖుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అల్లు గణపతిరెడ్డి తల్లిదండ్రులు అల్లు నాగేశ్వరరెడ్డి, సోమికాంతమ్మ జ్ఞాపకార్థం విద్యలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించి, బహుమతులు అందజేశారు. స్వామిదాసు మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులకు అవసరమైన పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు.

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం..

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాతృ భాష ఔన్నత్యంపై స్వామిదాసు వివరించారు. మాతృ భాష తెలుగుతో పాటు ఆంగ్ల భాష, హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, తెలుగు ఉపాధ్యాయిని ఎంబీడీ శ్యామలను సన్మానించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఎంపీటీసీ పులపాక మారేశు, గ్రామ పెద్దలు అల్లు గణపతిరెడ్డి, కాసర చెన్నారెడ్డి, మిద్దే నాగమియ్య, తాణంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థిని సత్కరిస్తున్న స్వామిదాసు దంపతులు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

తిరువూరు: విద్యార్థులు తమ భవిష్యత్‌ను నిర్దేశించుకునేందుకు క్రమశిక్షణతో మెలగాలని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణరాజు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 55వ వార్షికోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. చెడు స్నేహాలకు లోనుకావద్దని, సెల్‌ఫోన్ల జోలికి పోవద్దని, చెడు నడతకు అలవాటు పడితే విలువైన జీవితాన్ని కోల్పోతారని ఎస్ఐ హెచ్చరించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత పాఠ్య పుస్తకాలు వంటి సదుపాయాలున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు పసుపులేటి శేఖర్, మోదుగు ప్రసాద్ పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దాతలు దారా భూమయ్య, సంకా రాజారావు, కొల్లి పర సుబ్బారావు నగదు బహుమతులు అందజేశారు. మిరియాల రాంకుమార్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను వితరణ ఇచ్చారు. కౌన్సిలర్ శేఖర్‌బాబు కళాశాల అభివృద్ధి నిమిత్తం రూ.15వేల విరాళాన్ని అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అవకాశాలు కల్పిస్తే ఆడపిల్లలూ రాణిస్తారు

నూజివీడు: మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలకూ అవకాశాలు కల్పించాలని గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో గురువారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ అవకాశాలు కల్పిస్తే ఆడపిల్లలు ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. ఇప్పటికే శాస్త్రవేత్తలుగా, పైలెట్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, సివిల్ ఇంజినీర్లుగా, పోలీసులుగా, రాజకీయ నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. 18 ఏళ్లు నిండకుండా ఆడపిల్లలకు వివాహం చేయడం చట్టప్రకారం నేరమని, దీనికి లక్ష రూపాయల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రోజా, శాంత కుమారి, జయమణి, దుర్గ, కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థినులు, హెచ్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు

బలివే ఉత్సవాలను విజయవంతం చేద్దాం

నూజివీడు ఆర్డీఓ భవానీశంకరి

ముసునూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు సమన్వయంతో పనిచేసి బలివే మహా శివరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలని నూజివీడు ఆర్డీఓ భవానీ శంకరి అన్నారు. బలివేలోని రామలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఉత్సవాల నోడల్ అధికారి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలీ కుమారి అధ్యక్షతన ఉత్సవాల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ లక్షలాదిగా భక్తులు హాజరయ్యే బలివే మహోత్సవాల నిర్వహణను సవాలుగా స్వీకరించి విజయవంతం చేయాలన్నారు. డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో దేవదాయ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, సచివాలయ శాఖలు ముఖ్య భూమిక పోషిస్తూ మిగిలిన అన్ని శాఖలను సమన్వయపరిచి మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలన్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 5వ తేదీకల్లా తమ్మిలేరులోనికి నీరు చేర్చాలని ఆదేశించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ పద్మావతిదేవి, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు షిర్డీ సాయి బాబా ధ్యాన నిలయం వార్షికోత్సవం

గంపలగూడెం: గంపలగూడెం షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయం 24వ వార్షికోత్సవం శనివారం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, సాయిబాబాలకు పంచామృతాలతో అభిషేకం చేస్తారు. అనంతరం దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని వివరించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్

తిరువూరు: మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసు అధికారులు సహకరించాలని తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ అన్నారు. గురువారం తిరువూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహణపై పోలీస్, ఎస్ఈబీ అధికారులు, న్యాయవాదులతో జడ్జి సమావేశం నిర్వహించారు. కక్షిదారులకు అవగాహన కల్పించి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని, సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు, విస్సన్నపేట, చాట్రాయి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



తిరువూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహణకు సూచనలిస్తున్న జడ్జి మోతీలాల్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీపీ దేవిప్రవణ్య



రెడ్డిగూడెం: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రామినేని దేవిప్రవణ్య అన్నారు. రెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మద్దులపర్వ నుండి గణపవరం అడ్డరోడ్డు వరకు మరమ్మతుల నిమిత్తం మంజూరైన రూ. 50 లక్షలతో వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. మండల సమావేశం దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, వైస్ ఎంపీపీ–2 పాటిబండ్ల శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బుడే సాహెబ్, తహసీల్దార్ ఝాన్సీ లక్ష్మీకుమారి, ఎంపీడీఓ ఆశీర్వాదం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం

నూజివీడు: పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండలంలోని మిట్టగూడెంలో శుక్రవారం నుంచి ఈనెల 29 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పారిశుద్ధ్యం, బాల్య వివాహాలు, నీటి పొదుపు, బాలికా విద్య, స్వచ్ఛ గ్రామం, యువత–ఆరోగ్యం, చిరుధాన్యాల ప్రాధాన్యత, ఓటు ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, యోగా, పెరటి తోటలు తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తారని వివరించారు.

వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించాలి

ఎ.కొండూరు: రైతులు సాగులో వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ బీ సత్యవతి అన్నారు. వరిలో సమగ్ర సస్యరక్షణపై రైతులకు శిక్షణ కార్యక్రమం కోడూరు గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించారు. సత్యవతి మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు ఆశించినప్పుడు పైపాటుగా నత్రజని ఎరువులు వేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. అగ్గితెగులు, కాండం కుళ్లు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ టిప్పుసుల్తాన్, సర్పంచ్ సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఈఓ ఎ. రామచంద్రరావు, ఆర్‌బీకే సిబ్బంది టి. రాజేష్, రైతులు పాల్గొన్నారు.